ముందుకు సా..గని

రహ్మత్‌నగర్ రోడ్డు విస్తరణ పనులు

ఉన్నతాధికారులు పరిశీలించినా ఫలితం శూన్యం

యూసుఫ్‌గూడ, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): రహ్మత్‌నగర్ రోడ్డు విస్తరణ పనులు దశాబ్దాలుగా ముందుకు సాగడం లేదు. ప్రజాప్రతినిధులు మారినా, అధికారులు మారినా ఇక్కడ రోడ్డు విస్తరణ పనులు మాత్రం సాగడం లేదు. ఉన్నతాధికారులు పరిశీలించి వెళ్లినా పనులు ముందుకు సాగకపోవడం గమనార్హం.



ఒకే మార్గంలో రాకపోకలు

దశాబ్దం కింద ప్రణాళిక

వాహనాల రద్దీ దృష్ట్యా యూసుఫ్‌గూడ చెక్ పోస్టు నుంచి మోతీనగర్ వరకు రోడ్డును వన్‌వేగా మార్చాలని దశాబ్దం కిందట అధికారులు ప్రణాళిక రూపొందించారు. అనేక ఆటంకాలు వచ్చినా దాదాపు చాలా వరకు పనులు సాగాయి. కేవలం రహ్మత్‌నగర్ నిమ్స్‌మే నుంచి మధురానగర్ పోలీస్‌స్టేషన్ వరకు, నిమ్స్‌మే గ్రౌండ్ నుంచి శ్రీరామ్ నగర్ ఆంజనేయస్వామి ఆలయం వరకు రోడ్డు విస్తరణ జరగలేదు. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. ఈ ప్రాంతాల్లో రోడ్డు విస్తరణ అధికారులకు కంఠకంగా మారింది.

ఇరుకు రహదారి

రహ్మత్‌నగర్ చౌరస్తా వద్ద పీజేఆర్ మలుపు చాలా ఇరుకుగా ఉంది. ఆర్టీసీ బస్సు మలుపు తిరగడమే కష్టం. ఈ మలుపు నుంచి మధురానగర్ పోలీస్‌స్టేషన్ వరకు రోడ్డు ఇరుకుగా ఉండడంతో వాహనదారులు నానా ఇబ్బందులు పడుతున్నారు. అలాగే, నిమ్స్‌మే గ్రౌండ్ నుంచి శ్రీరామ్ నగర్ ఆంజనేయస్వామి ఆలయం వరకు రోడ్డు ఇరుకుగా ఉండడంతో ట్రాఫిక్ జామ్ అవుతోంది.

విస్తరించినా.. ఉపయోగంలో లేదు

శ్రీరామ్ నగర్ ఆంజనేయస్వామి ఆలయం నుంచి మోతీ నగర్ వరకు రోడ్డు వన్‌వేగా విస్తరణ జరిగింది. కానీ, ఇక్కడ భారీ వాహనాలు మలుపు తీసుకునేందుకు వీలు లేకపోవడంతో అటుగా వెళ్లడం లేదు. శ్రీరామ్ నగర్ చౌరస్తా వద్ద ఆటోలు పార్కు చేస్తుండడంతో కూడలి వద్ద మలుపు తీసుకునేందుకు వీలు లేదు. దీనికితోడు ఇక్కడ అందరూ వాహనాలు పార్కు చేస్తున్నారు. దీంతో మోతీనగర్ జైస్వాల్ ఆస్పత్రి వరకు వన్‌వే ఉన్నా వాహనదారులు, బస్సులు అటుగా వెళ్లకుండా ఒకవైపు మార్గంలోనే రాకపోకలు సాగిస్తున్నారు. జైస్వాల్ ఆస్పత్రి నుంచి మోతీనగర్ వరకు వనవే సాఫీగా సాగుతోంది.



శ్రీరామ్ నగర్‌లో ఒకే మార్గంలో వాహనాల రాకపోకలు

ఉన్నతాధికారులు పర్యటించినా..

రోడ్డు విస్తరణ పనుల జాప్యంపై ఉన్నతాధికారులు ఈ ప్రాంతంలో పలుమార్లు పర్యటించారు. రోనాల్డ్ రోస్ కమిషనర్‌గా ఉన్న సమయంలో ఇక్కడ పరిస్థితిని చూసి వెళ్లారు. స్థానిక కార్పొరేటర్ సీఎన్‌రెడ్డి వినతి మేరకు చీఫ్ సిటీ ప్లానర్ దేవేందర్‌రెడ్డి కూడా పర్యటించారు. సాధ్యమైనంత త్వరగా పనులు జరిగేలా చూస్తామన్నారు. ఇటీవల శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన ఉపేందర్‌రెడ్డి కూడా ఈ రోడ్డును పరిశీలించి పనులు జరిగేందుకు సహకారం అందిస్తామని తెలిపారు. కానీ, పనులు ఇంత వరకు ముందడుగు వేయలేదు.



రహ్మత్ నగర్ పీజేఆర్ మలుపు వద్ద వాహనాలు



రహ్మత్ నగర్ చౌరస్తాలో రోడ్డు విస్తరణ ప్రణాళిక మ్యాప్

బడ్జెట్ వస్తే పనులు మొదలవుతాయి

రహ్మత్‌నగర్ రోడ్డు విస్తరణ పనులు చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్నాయి. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లడంతోపాటు స్టాండింగ్ కమిటీలో చర్చించాను. కొంతమంది బాధితులకు నష్టపరిహారం ఇవ్వాల్సి ఉంది. బడ్జెట్ కేటాయింపు జరిగితే పనులు ప్రారంభమవుతాయి. సాధ్యమైనంత త్వరగా పనులు ప్రారంభమయ్యేందుకు కృషి చేస్తున్నా.

కార్పొరేటర్ సీఎన్ రెడ్డి



నిశుల్క్ ప్రభాత్ విద్యార్థులు రూపొందించిన వెల్‌కమ్ నమూనాలో ఫొటో దిగిన కలెక్టర్ హరిచందన

బాగా చదవాలి.. మంచిపేరు తెచ్చుకోవాలి

- కలెక్టర్ హరిచందన

ఖైరతాబాద్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు బాగా చదివి మంచి పేరు తెచ్చుకోవాలని కలెక్టర్ దాసరి హరిచందన సూచించారు. దశాబ్దాల చరిత్ర ఉన్న ఖైరతాబాద్ నిశుల్క్ ప్రభాత్ హిందీ తెలుగు ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలను ఆమె శుక్రవారం సందర్శించారు. విద్యార్థులతో దాదాపు అరగంటకు పైన సరదాగా గడిపారు. సైన్స్ ల్యాబ్‌లో విద్యార్థులు రూపొందించిన ఆవిష్కరణలను చూసి అభినందించారు. లైబ్రరీలు విజ్ఞాన భాండాగారాలని, అందులో కాసేపు గడపాలని సూచించారు. కంప్యూటర్ ల్యాబ్‌లో విద్యార్థులు తయారు చేసిన కోడింగ్ ప్రాజెక్టులను, గేమ్‌లను పరిశీలించిన ఆమె గేమ్స్ ఆడి వారి సృజనాత్మకతను ప్రశంసించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యక్షుడు మేజర్ కిరణ్, కరస్పాండెంట్ గోవింద్ ప్రసాద్, కార్యదర్శి రాకేష్, ప్రధానోపాధ్యాయుడు కరుణాకర్ రెడ్డి పాల్గొన్నారు.



టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌గౌడ్‌ను కలిసిన కాంగ్రెస్ నేత మురళీగౌడ్

టీపీసీసీ అధ్యక్షుడిని కలిసిన మురళీగౌడ్

యూసుఫ్‌గూడ, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో స్థానికంగా ఉన్న బీసీ నాయకుడికే టికెట్ కేటాయించాలని మాజీ కార్పొరేటర్, కాంగ్రెస్ పార్టీ నాయకుడు గుర్రం మురళీగౌడ్ టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్‌ను కోరారు. శుక్రవారం ఆయన నివాసంలో మాజీ కార్పొరేటర్లు గుర్రం మురళీగౌడ్, సంజయ్‌గౌడ్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఉప ఎన్నికలో కాంగ్రెస్ విజయంపై చర్చించామని వారు తెలిపారు.





కృష్ణానగర్ రోడ్లపై పారుతున్న మురుగు నీరు

కృష్ణానగర్‌లో మురుగు.. దుర్గంధం

యూసుఫ్‌గూడ, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): కృష్ణానగర్ సీ, డీ బ్లాక్‌ల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే వర్షం నీటితో పాటు మురుగు ప్రవాహంతో రోడ్లపై నడవలేని పరిస్థితిలో ఉన్నారు. వరద ప్రవాహానికి కొట్టుకొస్తున్న వ్యర్థాలు వెదజల్లే దుర్వాసనను భరించలేక పోతున్నారు. బయటకు వెళ్లి ఇంట్లోకి రాలేని పరిస్థితి. అధికారులు సమన్వయం చేసుకొని మురుగు ప్రవాహానికి అడ్డుకట్ట వేసి సమస్యను వెంటనే పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు. కొన్నేళ్లుగా నాలాలో పూడిక తీయకపోవడం వల్లే మురుగు సమస్య నెలకొందని స్థానికులు ఆరోపించారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

- మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్

ఎర్రగడ్డ, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు అహర్నిశలు పనిచేస్తానని మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్ అన్నారు. శుక్రవారం ఆయన ఎర్రగడ్డ డివిజన్‌లోని శాస్త్రి నగర్‌వాసులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అవగతం చేసుకోవడానికి నిత్యం పర్యటిస్తున్నట్లు తెలిపారు. ఎంతోకాలంగా పెండింగ్‌లో ఉన్న పనులు పూర్తయ్యేందుకు కృషి చేస్తానన్నారు. శాస్త్రి నగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బాలరాజు బస్తీలోని సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అంజన్ కుమార్ యాదవ్‌కు అందజేశారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ సికింద్రాబాద్ జిల్లా మైనార్టీ విభాగం చైర్మన్ మొహసిన్ ఖురేషి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎర్ర కృష్ణకుమార్, నాయకులు సుబ్రహ్మణ్యంరాజు, నాగళ్ల నరసింహారావు, రామచందర్, భాస్కర్, పోతురాజు నరసింహ, శంకర్‌రావు, భానుప్రకాష్, పీఆర్ విఠల్, సి.వెంకటేష్‌గౌడ్, వెంకటేష్, మల్లేష్, సంతోష్, సత్యవతి, సక్కుబాయి, స్వర్ణలత, మంగ, నర్సమ్మ, రమాదేవి పాల్గొన్నారు.



శాస్త్రి నగర్ వాసులతో సమావేశమైన అంజన్ కుమార్ యాదవ్



మజీద్ గడ్డలో స్థానికులతో మాట్లాడుతున్న రాఘవరెడ్డి, సీఎన్ రెడ్డి

మజీద్‌గడ్డ అభివృద్ధికి ప్రత్యేక నిధులు

వెంగళరావునగర్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మజీద్‌గడ్డ బస్తీ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించేందుకు కృషి చేస్తానని ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి అన్నారు. శుక్రవారం జవహర్ నగర్ బస్తీ మజీద్ గడ్డలో ఆయన రహ్మత్ నగర్ కార్పొరేటర్ సీఎన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి పర్యటించారు. స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ నెలలోనే అందరికీ రేషన్ కార్డులు అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేత మనోజ్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.



ప్రకాశ్‌నగర్‌లో సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ మహేశ్వరి

అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం వద్దు

- కార్పొరేటర్ మహేశ్వరి

బేగంపేట, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పనుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని బేగంపేట కార్పొరేటర్ టి.మహేశ్వరి హెచ్చరించారు. శుక్రవారం డివిజన్‌లోని ప్రకాశ్‌నగర్‌లో వాటర్, జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి ఆమె పర్యటించారు. ప్రకాశ్‌నగర్ ఎక్స్‌టెన్షన్‌లో 150 మీటర్ల పొడవు రోడ్డు నిర్మాణానికి రూ.30 లక్షల నిధులు మంజూరు కాగా, ఇప్పటికీ సగం వరకు కూడా రోడ్డు ఎందుకు వేయలేదని అధికారులను ప్రశ్నించారు. అసంపూర్తిగా రోడ్డు నిర్మాణం జరగడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు టి.శ్రీహరి, కృష్ణ, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థిని గెలిపించాలి

పంజాగుట్ట, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): కూటమి ఉప రాష్ట్రపతి అభ్యర్థి సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డికి తెలుగు రాష్ట్రాలకు చెందిన ప్రజాప్రతినిధులు పార్టీలకు అతీతంగా మద్దతు తెలిపి గెలిపించాలని ఏపీ యువజన కాంగ్రెస్ మాజీ అధికార ప్రతినిధి డాక్టర్ పీవీ రవిశేఖర్‌రెడ్డి కోరారు. శుక్రవారం వెంగళరావునగర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. రేవంత్‌రెడ్డిని థర్డ్ క్లాస్ ముఖ్యమంత్రి అని బీఆర్ఎస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ సంబోధించడాన్ని ఖండించారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

భరత నాట్యంలో ఆరంగ్రేటం

హైటెక్ సిటీ, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మాదాపూర్ శిల్పకళావేదికలో శుక్రవారం సాయంత్రం కొత్తకాపు హర్షిత రెడ్డి, రుచితారెడ్డి భరత నాట్య ఆరంగ్రేటం చేశారు. శ్రీ నారాయణి నాట్యాలయంలో నృత్యసాధన చేసిన వారు నృత్యప్రదర్శనతో ప్రేక్షకుల మనసు దోచారు. షణ్ముక కౌత్వం, అలరిపు, జతిత్వం, శబ్దం, పద వర్ణం, నటనం ఆడినార్, రామచంద్ర భజన, తిల్లానా ప్రదర్శించి మంగళం పలికారు. కార్యక్రమానికి కర్నాటక సంగీత గురువు డాక్టర్ మీనాక్షి పద్మనాభం, భరత నాట్య గురువు డాక్టర్ పి.ఇందిర, కూచిపూడి నాట్య గురువు డాక్టర్ విజయ పాల్ పత్లోత్ అతిథులుగా హాజరయ్యారు.



భరతనాట్యం ప్రదర్శిస్తున్న హర్షితరెడ్డి, రుచితారెడ్డి

సెల్‌ఫోన్ దొంగల అరెస్టు.. రిమాండ్

యూసుఫ్‌గూడ, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): సెల్‌ఫోన్ దొంగతనాలకు పాల్పడుతోన్న ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసి మధురానగర్ పోలీసులు రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నడుచుకుంటూ వెళ్తోన్న సాయిచరణ్ వద్ద నుంచి ద్విచక్ర వాహనంపై వచ్చిన ఇద్దరు అగంతకులు చేతిలో నుంచి ఫోన్ లాక్కొని పరారయ్యారు. బాధితుడు శుక్రవారం ఫిర్యాదు చేయగా.. వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు దొంగలను పట్టుకొని కేసును చేధించారు. తలాబ్‌కట్ట, భవానీనగర్‌కు చెందిన మహ్మద్ ముస్తఫా, ఖాన్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా.. 15 సెల్‌ఫోన్‌లు దొంగిలించినట్టు అంగీకరించారు. ఈ కేసులో మరో ముగ్గురు నిందితులు మహ్మద్ జహంగీర్, షేక్ సోహైల్, హర్షద్ పరారీలో ఉన్నట్టు పోలీసులు తెలిపారు. వీరిపై కూకట్‌పల్లి, మాదాపూర్, శంషాబాద్, మధురానగర్, పంజాగుట్ట, సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో కేసులు నమోదైనట్టు పేర్కొన్నారు.



శ్రీ విజయలక్ష్మి ఆలయంలో లక్ష కుంకుమార్చనలో భక్తులు



ఉపన్యాసం చేస్తున్న వేద పండితులు నరసింహులు

శ్రీ విజయలక్ష్మి ఆలయంలో ఘనంగా లక్ష కుంకుమార్చన

ఎర్రగడ్డ/పంజాగుట్ట, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ఎర్రగడ్డలోని శ్రీ విజయలక్ష్మి ఆలయంలో శుక్రవారం లక్ష కుంకుమార్చన నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి కుంకుమ సమర్పించారు. ఉదయం 108 లీటర్ల పాలతో అమ్మవారికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ చింతల రామచంద్రారెడ్డి మాట్లాడుతూ ఆలయంలో శ్రావణమాస విశేష మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన కార్యదర్శి పి.జనార్దన్, కోశాధికారి ఎంవీ రెడ్డి, అర్చకులు గట్టు రంగాచారి, వంశీకృష్ణ, నరసింహులు, మేనేజర్ మల్లేష్ పాల్గొన్నారు. శ్రావణ మాసం చివరి శుక్రవారం సందర్భంగా ఖైరతాబాద్ మహిళా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఆధ్వర్యంలో తుమ్మలబస్తీలోని సంఘం కార్యాలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. స్థానిక కార్పొరేటర్ పి.విజయారెడ్డి పూజలు చేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షురాలు మంగళపల్లి సునీత, ఉపాధ్యక్షురాలు తులసి, కోశాధికారి ఎం.లావణ్యతో పాటు డైరెక్టర్లు, సభ్యులు పాల్గొన్నారు.



శ్రావణ మాసం చివరి శుక్రవారం సందర్భంగా పూజలో పాల్గొన్న ఖైరతాబాద్ కార్పొరేటర్ విజయారెడ్డి



బోరబండ పోలీస్‌స్టేషన్‌లో బీజేపీ నాయకులు దర్శనం నాగేశ్వరరావు, శ్రీనివాసులురెడ్డి కాట్రాజ్ రాజ్‌కుమార్ తదితరులు

బీజేపీ నేతల అరెస్ట్

ఎర్రగడ్డ, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): 'సేవ్ హైదరాబాద్.. చలో సెక్రెటేరియట్' పిలుపు మేరకు బీజేపీ శ్రేణులు పెద్ద ఎత్తున శుక్రవారం సచివాలయ ముట్టడికి యత్నించారు. ముందస్తుగా కొందరిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ జీహెచ్ఎంసీ పరిధిలో రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్, తాగునీటి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. బోరబండకు చెందిన బీజేపీ నాయకులు దర్శనం నాగేశ్వరరావు, శ్రీనివాసులురెడ్డి, రాజ్‌కుమార్‌ను పోలీసులు అరెస్ట్ చేసి సొంత పూచీకత్తుపై విడుదల చేశారు.

వినాయక చవితిని ప్రశాంతంగా జరుపుకోవాలి



సైఫాబాద్ ఏసీపీ సంజయ్ కుమార్, ఖైరతాబాద్ ఇన్‌స్పెక్టర్ వెంకటరెడ్డిని కలిసిన బీజేపీ ఖైరతాబాద్ నాయకులు

యూసుఫ్‌గూడ/ఖైరతాబాద్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భక్తితో పూజలు చేసి, పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని పంజాగుట్ట ఏసీపీ మురళీకృష్ణ అన్నారు. మధురానగర్ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం గణేశ్ ఉత్సవ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిమజ్జన మార్గంలో ఏవైనా సమస్యలు తలెత్తినపుడు వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ప్రజలకు అసౌకర్యం కలగకుండా ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు పోలీస్ శాఖ అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో సీఐలు ప్రభాకర్, శోభన్, డీఐ రవి కుమార్, ఎస్ఐలు సాయికుమార్ గౌడ్, సుష్మ, శివశంకర్, భానుచందర్‌తో పాటు నిర్వాహకులు పాల్గొన్నారు. సైఫాబాద్ ఏసీపీ సంజయ్ కుమార్, ఖైరతాబాద్ ఇన్‌స్పెక్టర్ వెంకటరెడ్డిని కలిసి పలు సమస్యలు, గణేశ్ ఉత్సవాలపై బీజేపీ ఖైరతాబాద్ నాయకుడు ఆదర్శ్ వంశీకర్ తదితరులు చర్చించారు.



స్థానికులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ దేదీప్య

జలమండలి అధికారులపై కార్పొరేటర్ ఆగ్రహం

వెంగళరావునగర్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): జలమండలి అధికారులపై కార్పొరేటర్ దేదీప్య ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానికుల ఫిర్యాదు మేరకు ఆమె జలమండలి మేనేజర్ సూర్యప్రకాష్‌తో కలిసి శుక్రవారం బస్తీలో పర్యటించారు. తాగునీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఆమె వెంట స్థానిక నాయకులు విజయ్ ముదిరాజ్, ఆంజనేయులు యాదవ్, కట్ల లక్ష్మి, తదితరులు ఉన్నారు.

అతిథి అధ్యాపకులకు దరఖాస్తుల ఆహ్వానం

కేపీహెచ్‌బీకాలనీ, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి అతిథి అధ్యాపకుల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డా.కె.పద్మావతి తెలిపారు. కంప్యూటర్ సైన్స్, కామర్స్, బీబీఏ కోర్సులను బోధించడానికి ఆసక్తి గల వారు ఈనెల 25వ తేదీలోపు కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు. సంబంధిత సబ్జెక్టు పీజీలో కనీసం 55 శాతం, ఎస్సీ, ఎస్టీ అయితే 50శాతం ఉత్తీర్ణత ఉన్న వారు మాత్రమే అర్హులని ఆమె పేర్కొన్నారు.



బోర్‌వెల్ పనులకు శంకుస్థాపన చేస్తున్న కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్

నియోజకవర్గ అభివృద్ధే ముఖ్యం: శ్రీగణేష్

సికింద్రాబాద్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ అభివృద్ధే ప్రధాన అజెండాగా పనిచేస్తానని, గత పదేళ్ల కాలంలో బీఆర్ఎస్ నాయకులు ఇక్కడి ప్రజల కనీస అవసరాలు పట్టించుకోలేదని సికింద్రాబాద్ కంటోన్మెంట్ శాసనసభ్యుడు ఎన్.శ్రీగణేష్ అన్నారు. శుక్రవారం రసూల్‌పురా సిల్వర్ కంపౌండ్ డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల సముదాయంలో రాష్ట్ర ప్రభుత్వ స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్స్‌తో బోర్‌వెల్ నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడి నియోజకవర్గానికి ప్రత్యేక అభివృద్ధి నిధులు తీసుకువచ్చినట్టు చెప్పారు. మంచినీరు, మురుగునీరు, రోడ్లు తదితర సదుపాయాల మెరుగుకు కృషి చేస్తున్నట్టు ఎమ్మెల్యే వెల్లడించారు.



బండ కార్తీకా చంద్రారెడ్డిని తార్నాకలోని ఆమె నివాసంలో ముందస్తు గృహ నిర్బంధం చేసిన పోలీసులు

మాజీ మేయర్ బండ కార్తీకారెడ్డి గృహ నిర్బంధం

తార్నాక, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీ అసమర్థ పాలనను నిరసిస్తూ బీజేపీ తలపెట్టిన చలో సెక్రటేరియట్ కార్యక్రమం నేపథ్యంలో శుక్రవారం ఓయూ పోలీసులు జీహెచ్‌ఎంసీ మాజీ మేయర్ బండ కార్తీకా చంద్రారెడ్డిని తార్నాకలోని ఆమె నివాసంలో ముందస్తు గృహ నిర్బంధం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజా సమస్యలపై పోరాటాలు చేస్తున్న వారిని అక్రమంగా అరెస్టు చేయడాన్ని ఖండించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు బండ చంద్రారెడ్డి, శివారెడ్డి, వీరన్న, కిరణ్ గౌడ్, సంపత్, భూపాల్ రెడ్డి, చరణ్ రాజ్, లడ్డు, కేదార్, రాజ్ కుమార్, చిన్ని కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



దేవాలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

సంతోషిమాతకు తలసాని పూజలు

రాంగోపాల్‌పేట్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : శ్రావణ మాసం ఎంతో పవిత్రమాసమని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. శ్రావణ మాసం చివరి శుక్రవారాన్ని పురస్కరించుకొని రాంగోపాల్‌పేట్ డివిజన్ పరిధిలోని జీరాలో గల శ్రీ సంతోషిమాత దేవాలయంలో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా ఆలయ పండితులు ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. పూజలు అనంతరం వేదమంత్రాలతో ఆశీర్వచనం చేసి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యేను ఆలయ నిర్వాహకులు సత్కరించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ అతెల్లి మల్లికార్జున్ గౌడ్, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, నాయకులు నామాల ప్రేమ్ కుమార్, కొశికె కిషోర్ కుమార్, లక్ష్మీపతి, అరుణ్ గౌడ్, కుమార్ యాదవ్, జనార్ధన్, తాండ్ర రాజు పాల్గొన్నారు.



కనకదుర్గ ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న కార్పొరేటర్ కంది‌శైలజ

కనకదుర్గ ఆలయంలో ప్రత్యేక పూజలు

బౌద్ధనగర్, ఆగస్టు22 (ఆంధ్రజ్యోతి): ఆఖరిశ్రావణ శుక్రవారం కావడంతో బౌద్ధనగర్ కనకదుర్గ ఆలయంలో భక్తులు పోటెత్తారు. మహిళలు అధికసంఖ్యలో పాల్గొని కుంకుమార్చన పూజలు నిర్వహించారు. అమ్మవారిని వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. డివిజన్ కార్పొరేటర్ కంది‌శైలజ కనకదుర్గ అమ్మవారి ఆలయంలో ఒడిబియ్యం పోసి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మహిళలకు వాయనాలు ఇచ్చారు. ఆలయచైర్మన్ కె.ధరణీధర్, ప్రధాన అర్చకులు శ్రీనివాసపంతులు అమ్మవారిని దర్శించుకున్నారు.

మరమ్మతులు చేయించరూ..



నిరుపయోగంగా వాటర్ ట్యాంక్

మారేడుపల్లి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : మోండా డివిజన్ పరిధిలోని ఈస్ట్ మారేడుపల్లి అంబేద్కర్ నగర్ బస్తీలో 2015 లో బస్తీ అవసరాలను తీర్చడానికి పవర్ బోర్‌వెల్‌ను వేసి దాని పక్కనే 1000 లీటర్ల కెపాసిటీ గల వాటర్ ట్యాంకును ఏర్పాటు చేశారు. అప్పట్లో దీని అవసరం ఎంతో ఉపయోగకరంగా ఉండేది. కాలక్రమేనా బోర్‌వెల్ పాడవడంతో వాటర్ ట్యాంకు నిరుపయోగంగా మారిపోయింది. వాటర్ ట్యాంకు ఉపయోగంలో ఉన్న సమయంలో కనీస అవసరాలతో పాటు ఇతర అవసరాలకు ఉపయోగపడేది. బోర్‌వెల్ పాడై ఐదు సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ మరమ్మతులు చేయించడానికి అధికారులు నిర్లక్ష్య ధోరణి వహిస్తున్నారని బస్తీవాసులు మండిపడుతున్నారు. కాగా బస్తీలో కలుషిత నీరు సరఫరా అయినప్పుడు బోర్‌వెల్ నీటిని పట్టుకొని వాటిన వడబోసి తాగుతుండేవారమని ఇప్పుడు అలాంటి వసతి కరువైందని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే మరమ్మతులు చేపట్టి వాటర్ ట్యాంకును అందుబాటులోకి తీసుకు రావాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.



సికింద్రాబాద్ నియోజకవర్గ అభివృద్ధికోసం హైదరాబాద్ కలెక్టర్ దాసరి హరిచందనను కలిసిన పీసీసీ కార్యదర్శి ఆదం సంతోష్‌కుమార్.

- (సికింద్రాబాద్, ఆంధ్రజ్యోతి)

చవితికి గణేష్ టెంపుల్ ముస్తాబు

రెజిమెంటల్ బజార్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): రెండువందల ఏళ్ల చరిత్ర గల పురాతన దేవాలయం అయిన సికింద్రాబాద్ గణేష్ టెంపుల్ వినాయక చవితి వేడుకలకు ముస్తాబవుతుంది. ఆలయంలో వినాయకుడి విగ్రహం స్వయంభువుగా వెలిసిందని భక్తులు విశ్వసిస్తారు. విరూపాక్ష గణపతి రూపంలో ఇక్కడి వినాయకుడు దర్శనమిస్తాడు.

పన్నెండు రోజులు విశేష అలంకారాలు, వాహన సేవలు

నవరాత్రుల విశేష పూజలు

27వ తేదీ వినాయకచవితి రోజు గణపతిమూర్తిని సమీపంలో ఉన్న శ్రీ పాండురంగ విఠలేశ్వరస్వామి దేవాలయం నుంచిఊరేగింపుగా తీసుకువచ్చి ప్రతిష్ఠాపన, పుష్పగిరి పీఠాధిపతులు జగద్గురు శ్రీ అభినవోద్ధండ శ్రీ విద్యాశంకర భారతీ స్వామివారిచే శ్రీ మహాగణపతి స్వామి మూలవరులకు పంచామృత అభిషేకం, ఉత్సవమూర్తులకు మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, సహస్ర మోదక మూల మంత్ర గణపతి హోమం నిర్వహిస్తారు.

విశేష అలంకారములు, వాహన సేవలు

27 న సువర్ణాలంకారం, ఊంజల సేవ, 28న గంధాలంకారము, శేషవాహన సేవ, 29న నవనీతాలంకారము, సింహవాహన సేవ, 30న సింధూరాలంకారం, మయూరవాహన సేవ, 31న శాకాంబరాలంకారం, ఊంజల సేవ, 1న భస్మాలంకారము, పల్లకీసేవ, 2న కుంకుమాలంకారం, గజవాహన సేవ, 3న దూర్వార అలంకారం, మూషిక వాహన సేవ, 4న హరిద్రాలంకారం, అశ్వవాహన సేవ, 5న పుష్పాలంకారం, రాజదర్బార్, 6న రజిత కవచ అలంకారం, రథోత్సవం, 7న నిధి అలంకారం.



గణేష్ టెంపుల్

వేడుకలకు ముస్తాబైన టెంపుల్ లోపలిభాగం

వినాయక చవితి ఏర్పాట్లు

చవితి పండుగకు ఆలయాన్ని ముస్తాబు చేస్తున్నారు. ఇప్పటికే రంగులు వేయుడం పూర్తికాగా విద్యుత్ బల్బుల అలంకరణ ప్రారంభించారు. రెండు రోజుల ముందు పూల అలంకరణ చేపట్టనున్నారు. స్థానిక ప్రతినిధులు ఎంపీ, ఎమ్మెల్యే, కార్పొరేటర్లకు ఆలయ ఈవో, పాలకమండలి సభ్యులు ఆహ్వాన పత్రాలను అందజేశారు.

ఎంపీ, ఎమ్మెల్యే, కార్పొరేటర్‌కు నవరాత్రోత్సవాలకు ఆహ్వానం



ఎమ్మెల్యే శ్రీగణేష్‌కు ఆహ్వాన పత్రం అందిస్తున్న ఈఓ, పాలక మండలి సభ్యులు

ఏర్పాట్లు చేస్తున్నాం..



వినాయక చవితి వైభవంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నాం. క్యూ లైన్‌లు, తాగు నీరు, విద్యుత్, పూల అలంకరణ పనులు ప్రారంభించాం. ఆలస్యం కాకుండా భక్తులు త్వరగా స్వామి వారిని దర్శించుకోవడానికి ఏర్పాట్లు చేస్తున్నాం.

- ప్రభాకర్ యాదవ్, ఆలయ చైర్మన్

ఆలయ చరిత్ర

పూర్వకాలంలో మిలిటరీ ఏరియాగా ఉన్న ఈ ప్రాంతంలో సైనికులు మంచినీళ్ల కోసం బావి తవ్వుతుండగా వినాయకుడి విగ్రహం బయటపడగా సైనికులు ఆగమశాస్త్ర ప్రకారం నిర్మించిన ఆలయంలో విగ్రహాన్ని ప్రతిష్ఠించినట్లు చరిత్ర చెబుతోంది. ఈ ఆలయంలో ఇంకా నవగ్రహాలు, శ్రీవల్లీ దేవసేనా సమేత సుబ్రహ్మణ్యస్వామి, అంజనేయస్వామి, ఉమామహేశ్వరులు, వేంకటేశ్వర స్వామి దేవుళ్ల విగ్రహాలు ఉన్నాయి. ప్రతి సంవత్సరం వినాయక చవితి వేడుకలను వైభవంగా నిర్వహిస్తారు. నగరం నలుమూలల నుంచి భక్తులు స్వామి దర్శనానికి తరలివస్తారు.

పార్కింగ్ ఏర్పాట్లు చేయాలి



వినాయక చవితి రోజు పెద్ద సంఖ్యలో భక్తులు స్వామి వారి దర్శనం వస్తారు. దీంతో వాహనాల పార్కింగ్ సమస్యగా మారింది. కనుక పార్కింగ్ ఇబ్బందులు లేకుండా ఆలయ పాలకమండలి, ఆలయ సిబ్బంది ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. - సుబ్బారావు, భక్తుడు, తుకారంగేట్



వినాయక మండపాల నిర్వాహకులతో సమావేశమైన ఏసీపీ సుబ్బయ్య పోలీస్ ఇన్‌స్పెక్టర్లు

పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలి : ఏసీపీ సుబ్బయ్య

అడ్డగుట్ట, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : ప్రశాంత వాతావరణలో మతాలకతీతంగా వినాయక పండుగను జరుపుకోవాలని గోపాలపురం డివిజన్ ఏసీపీ సుబ్బయ్య మండప నిర్వాహకులకు సూచించారు. శుక్రవారం తుకారాంగేట్ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన గణేష్ మండప నిర్వాహకులతో ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడుతూ, సికింద్రాబాద్ డివిజన్‌లోని గోపాలపురం, మారేడుపల్లి, తుకారాంగేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న ప్రాంతాల్లో గణేష్ ఉత్సవాలు మతాలకు కతీతంగా జరుపుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మండప నిర్వాహకులు పోలీసులు ఆదేశాలు పాటిస్తూ, పూర్తి సహకారాలు అందించాలని కోరారు. మీ ప్రాంతాల్లో ఏదైన ఘటన జరిగితే వెంటనే పోలీస్ కంట్రోల్ రూం లేదంటే మీ పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాల్సిన బాధ్యత తమపై ఉందన్నారు. తొమ్మిది రోజుల పాటు ప్రతి రోజు రాత్రి మండపాల వద్ద ఎవరైన ఒకరు కమిటీ సభ్యుడు నిద్ర చేయాలని, ఎప్పటికప్పుడు విగ్రహాన్ని పరిశీలిస్తూ ఉండాలన్నారు. మధ్యరాత్రి వరకు మండపాల వద్ద గుమికూడవద్దు, డీజేలను నిషేధించామని, ఫిర్యాదులు వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తుకారాంగేట్ పీఎస్ పరిధిలో ఇప్పటికి 190 దరఖాస్తులు వచ్చాయని, చివరి రోజుకు ముందే మీ సేవలో దరఖాస్తు చేసుకోవాల్సిన బాధ్యత వారిపై ఉందన్నారు. పీస్ కమిటీ సమావేశంలో తుకారాంగేట్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్ రెడ్డి, మారేడుపల్లి సీఐ, గోపాలపురం సీఐతో పాటు ఎస్సైలు, డీఐలు పాల్గొన్నారు.

పాఠశాల యాజమాన్య కమిటీలను కొనసాగించాలి : భాగ్యలక్ష్మి




అడ్డగుట్టలో ప్రత్యేక సమావేశంలో పాల్గొన్న బాలల హక్కుల పరిరక్షణ వేదిక ప్రతినిధులు

అడ్డగుట్ట, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో పాఠశాల యాజమాన్య కమిటీలను యథావిధిగా కొనసాగించాలని తెలంగాణ తల్లుల సంఘం రాష్ట్ర కన్వీనర్ భాగ్యలక్ష్మి ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం అడ్డగుట్టలో తెలంగాణ తల్లుల సంఘం, బాలల హక్కుల పరిరక్షణ వేదిక, టీపీఏ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, బాలలకు ఉచిత నిర్బంధ విద్యా హక్కు చట్టం 2009 లోని సెక్షన్ 21, 22 ద్వారా తల్లిదండ్రులకు పాఠశాల నిర్వహణలో భాగస్వామ్యం కల్పించేందుకు దేశంలోని ప్రతీ పాఠశాలలో యజమాన్య సంఘాన్ని ఏర్పాటు చేయాలన్నారు. దీంతో పాఠశాలలో నెలకొన్న సమస్యలపై ఎప్పటికప్పుడు విద్యాశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు వీలుగా ఉంటుందని తెలిపారు. గతంలో ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీని ఏర్పాటు చేసిందని, ఈ కమిటీలో ఇప్పటి వరకు ఎవరిని కూడా కమిటీ సభ్యులుగా నియమించలేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ పేరెంట్స్ అసోసియేషన్ కార్యదర్శి అజయ్ బాబు, సిఆర్‌పిఎఫ్ కార్యదర్శి చింతల లక్ష్మీనారాయణ, రమాదేవి, జిల్లా కో కన్వీనర్ నక్కల శోభ, సిఆర్‌పిఎఫ్ కన్వీనర్ ఎల్. ప్రవీణ్ కుమార్, సంయుక్త కార్యదర్శులు సువర్ణ, లత, రేమిడియల్ టీచర్లు సుమలత, లావణ్య పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలి

మాదిగ సోషలిస్ట్ పార్టీ జాతీయ నాయకుడు

బౌద్ధనగర్, ఆగస్టు22 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని మాదిగ సోషలిస్ట్ పార్టీ (ఎంఎస్‌పీ) జాతీయ నాయకుడు ఎస్.నరేంద్రబాబు మాదిగ అన్నారు. శుక్రవారం ఎంఎస్‌పీ హైదరాబాద్ జిల్లా అధికారప్రతినిధి డప్పు మల్లికార్జున్ ఆధ్వర్యంలో బౌద్ధనగర్ సంజీవపురంలో వికలాంగులు, చేయూత పెన్షన్‌దారులతో నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. సెప్టెంబర్‌9న హైదరాబాద్‌లో తలపెట్టిన చేయూత పింఛన్‌దారుల మహాగర్జనకు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు రుద్రమాదిగ, తుమ్మల శివప్రసాద్ పాల్గొన్నారు.



రైల్వే జీఎం సంజయ్‌కు వినతిపత్రం అందిస్తున్న రాఘవరావు

వృద్ధులు, వితంతువుల పెన్షన్ పెంచాలి

బోయినపల్లి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ఎన్నికలకు ముందు సీఎం ఇచ్చిన హామీ మేరకు ఆంధ్రప్రదేశ్‌లో లాగా వికలాంగుల పెన్షన్ రూ. 4000 నుంచి రూ.6000 వృద్ధులు, వితంతువులకు పెన్షన్ 2016 నుంచి 4వేలు, తీవ్ర వైకల్యం, తీవ్ర రోగగ్రస్తులకు రూ.15 వేలు పెంచాలని కంటోన్మెంట్ ఎంఆర్పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో ప్రజలను చైతన్యం చేయడానికి మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఎంఆర్పీఎస్, వీహెచ్‌పీఎస్, సీహెచ్‌పీఎస్, ఎంఎస్‌పీ నాయకులు ఇటుక శ్రీకిషన్ ఆధ్వర్యంలో ప్రజా చైతన్య వేదికలు నిర్వహించారు. ఈ క్రమంలో శుక్రవారం బోయినపల్లి అంబేద్కర్ నగర్ బస్తీలో పెన్షన్‌దారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు.

రైల్వే పోర్టర్ల సమస్యలు పరిష్కరించాలి

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : రైల్వే పోర్టర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రైల్వే లైసెన్డ్ పోర్టర్ల సంఘం ప్రధాన కార్యదర్శి ఆర్‌వీఎస్ రాఘవరావు శుక్రవారం నూతనంగా బాధ్యతలు చేపట్టిన దక్షిణ మధ్య రైల్వే జీఎం సంజయ్ కుమార్ శ్రీవాత్సవను సన్మానించి వినతి పత్రం సమర్పించారు ఈ సందర్భంగా రాఘవరావు మాట్లాడుతూ చాలా కాలంగా అపరిష్కతంగా ఉన్న యూనిఫాంల సరఫరా, బ్యాటరీ కార్ల నిషేధం, బ్యాడ్జీల బదిలీ, మెడికల్ గుర్తింపు కార్డుల జారీ, పార్సిల్ ఆఫీస్‌లో పనుల పునరుద్ధరణ, రైల్వే పాస్‌లు, పిల్లలకు సౌకర్యాలు రైల్వే పోర్టర్లకు కల్పించాలని జీఎంకు వినతి పత్రం అందించారు. అందుకు రైల్వే జీఎం ఈ సమస్యలపై రైల్వే బోర్డు దృష్టికి తీసుకెళతానని హామీ ఇచ్చారన్నారు.



మహాకాళి అమ్మవారికి సాకలు సమర్పిస్తున్న భక్తులు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

ఉజ్జయినీ మహాకాళి ఆలయంలో భక్తుల సందడి

సికింద్రాబాద్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసం చివరి శుక్రవారం కావడంతో సికింద్రాబాద్ ఉజ్జయినీ మహాకాళి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. సికింద్రాబాద్‌తోపాటు నగరం, శివార్ల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు. అమ్మవారికి పూజలు చేసి, మొక్కులు తీర్చుకున్నారు. కాగా బోనాల జాతరలో భాగంగా రంగం కార్యక్రమంలో భవిష్యవాణి చెప్పిన మేరకు వరుసగా ఐదో శుక్రవారం కూడా ఆలయ కార్యనిర్వహణాధికారి గుత్తా మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలో అమ్మవారికి సాకలు సమర్పించారు. ఆలయానికి భక్తులు పోటెత్తడంతో మహంకాళి ఇన్‌స్పెక్టర్ పరశురామ్ పోలీసు బందోబస్తు నిర్వహించారు. అమ్మవారి దర్శనానికి క్యూలో పంపించే ఏర్పాట్లు చేశారు.



పండ్లతో అలంకరించబడిన అమ్మవారు

చవితి ఉత్సవాల ఏర్పాటపై సమావేశం



అధికారులతో కార్పొరేటర్ సునీత

చిలకలగూడ, ఆగస్టు22 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి ఉత్సవాల నిర్వహణకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు గావిస్తున్నట్లు మెట్టుగూడ కార్పొరేటర్ రాసూరి సునీత తెలిపారు. శనివారం వార్డు కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. గణేష్ మండపాల నిర్వాహకులు తీసుకోవలసిన జాగ్రత్తలు, ఉత్సవ రోజుల్లో అదనంగా నీటి సరఫరా, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, పెరిగిన చెట్ల కొమ్మల తొలగింపు, తాగునీటి సరఫరా, విద్యుత్ స్తంభాలు, హైటెన్షన్ వైర్ల వద్ద తీసుకోవలసిన జాగ్రత్తలు తదితర అంశాలపై చర్చించి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉత్సవాలు నిర్వహించాలని తీర్మానించారు.



ఏసీపీ ట్రాఫిక్ వన్ నార్త్ జోన్ కార్యాలయ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ట్రాఫిక్ డీసీపీ రాహుల్ హెగ్డే, ఏసీపీ శంకర్ రాజు

ట్రాఫిక్ చట్టాలను ప్రతి ఒక్కరూ గౌరవించాలి

మారేడుపల్లి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటిస్తూ చట్టాలను గౌరవించాలని ట్రాఫిక్ డీసీపీ రాహుల్ హెగ్డే సూచించారు. శుక్రవారం కార్ఖానాలోని మారేడుపల్లి పోలీస్ స్టేషన్ భవనంపై పునర్ నిర్మించిన ఏసీపీ ట్రాఫిక్ వన్ నార్త్ జోన్ కార్యాలయాన్ని ట్రాఫిక్ ఏసీపీ శంకర్ రాజుతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ రూల్స్ పాటించినప్పుడే ట్రాఫిక్‌ను అధిగమించవచ్చన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా ఎలాంటి వాహనమైన నడపడం చట్టరీత్యా నేరమన్నారు. ఏసీపీ శంకర్‌రాజు మాట్లాడుతూ.. పాదచారులకు ఆటంకం కలగకుండా ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలు చేస్తూ ఇబ్బందులకు గురి చేయవద్దని కోరారు. వాహనదారులకు ట్రాఫిక్ అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టడమే తమ బాధ్యత అని గుర్తు చేశారు.



ప్రకాశ్‌నగర్‌లో సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ మహేశ్వరి

అభివృద్ధి పనులు ఆలస్యం కావొద్దు : మహేశ్వరి

బేగంపేట, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పనుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని బేగంపేట కార్పొరేటర్ టి. మహేశ్వరి అన్నారు. శుక్రవారం డివిజన్‌లోని ప్రకాశ్‌నగర్‌లో వాటర్, జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ప్రకాశ్‌నగర్ ఎక్స్‌టెన్షన్‌లో 150 మీటర్ల పొడవు రోడ్డు నిర్మాణానికి రూ.30 లక్షల నిధులు మంజూరు కాగా ఇప్పటి వరకు సగం కూడా రోడ్డు ఎందుకు వేయలేదని అధికారులను ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు టి. శ్రీహరి, కృష్ణ, నర్సింహా తదితరులు పాల్గొన్నారు.



శశిధర్ చేతులమీదుగా నియామకపత్రాన్ని అందుకుంటున్న కన్వీనర్ లడ్డు

భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి కన్వీనర్‌గా లడ్డు

బౌద్ధనగర్, ఆగస్టు22 (ఆంధ్రజ్యోతి): భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి బౌద్ధనగర్ డివిజన్ కన్వీనర్‌గా పార్శీగుట్టకుచెందిన లడ్డు నియమితులయ్యారు. గణేశ్ ఉత్సవ కమిటీ కార్యాలయంలో జరిగిన సికింద్రాబాద్ అసెంబ్లీ ముఖ్య నాయకుల సమావేశంలో ఉత్సవ కమిటీ ప్రధానకార్యదర్శి రావినూతల శశిధర్ చేతులమీదుగా లడ్డు నియామకపత్రాన్ని అందుకున్నారు. గణేశ్ ఉత్సవాలు సవ్యంగా జరిగేలా కృషి చేస్తానని, మండప నిర్వాహకులతో సమావేశాన్ని నిర్వహించి తగు జాగ్రత్తలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి కార్యదర్శి ఆలే భాస్కర్, సికింద్రాబాద్ కో-కన్వీనర్ భాస్కరగిరి, బీజేపీ మహంకాళి జిల్లా ఉపాధ్యక్షులు రాచమల్ల కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

భారీ గణనాథుడి మండపానికి ఏర్పాట్లు

చిలకలగూడ, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): బీజేపీ సీనియర్ నాయకుడు బండపల్లి సతీష్ ఆధ్వర్యంలో చిలకగూడ మునిసిపల్ మైదానంలో గణపతి నవరాత్రోత్సవాల కోసం ఏర్పాట్లు చేస్తున్నారు. శుక్రవారం భూమిపూజ నిర్వహించి భారీ మండపం ఏర్పాటు పనులను ప్రారంభించారు. ఇందులో భాగంగా చండీహోమం, లక్ష పుష్పార్చన, లక్ష ఫలార్చన, చండీహోమం, మూడవ రోజు నుంచి నిత్య అన్నదానం ప్రతి రోజు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.